సాక్షి
కాకినాడ

గురువారం । 21 । డిసెంబర్ । 2023



వాడపల్లి క్షేత్రంలో సిరుల వర్షం

వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి హుండీల ద్వారా రూ.85,16,279 ఆదాయం సమకూరింది.


8 లో



సాత్విక్‌కు ఖేల్‌రత్నపై హర్షం

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌కు 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' అవార్డు వరించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

డెల్టాలకు 11 వేల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం డెల్టా కాలువలకు 11 వేల క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,400, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

మ్యూజియం అభివృద్ధికి నిధులు ఇవ్వండి

ఎంపీ వంగా గీత

కాకినాడ సిటీ: కాకినాడ పురాతన మ్యూజియంకు త్వరితగతిన నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలంటూ ఎంపీ వంగా గీత ఢిల్లీ కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శి ముగ్ధా సింహనాను కలిసి కోరారు. ఈ మేరకు ఆమె బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో అత్యంత పురాతనమైన శిల్పాలు, చారిత్రాత్మక పత్రాలు పురాతన సంపద కలిగి ఉన్న కాకినాడ మ్యూజియం అభివృద్ధికి నివేదిక సమర్పించినట్లు ఎంపీ తెలిపారు. నివేదిక ఢిల్లీ నుంచి కలకత్తాకి స్క్రూట్నీ కోసం పంపినట్టు తెలిపారు. అనంతరం తిరిగి ఢిల్లీలోని తమ శాఖకు పంపించారన్నారు. ఆ శాఖ తరపున త్వరగా ఫైలు పరిశీలించి నిధుల మంజూరుకు పై అథారిటీ కమిటీకి సమర్పించాలని కోరినట్లు ఆమె వివరించారు. గీత ప్రతిపాదనపై కార్యదర్శి ముగ్ధా సింహనా స్పందిస్తూ జనవరిలో జరిగే కమిటీ సమావేశంలో చర్చించి అనుమతి మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు.

కొత్త వేరియంట్‌పై నోడల్ బృందం నియామకం

కాకినాడ క్రైం: కోవిడ్ జేఎన్ 1 వేరియంట్ ఉనికిపై కాకినాడ జీజీహెచ్‌లో సమావేశం జరిగింది. బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి అధ్యక్షతన హెచ్‌వోడీలంతా సమావేశమయ్యారు. కొత్త వేరియంట్ ఉనికి, వ్యాప్తి, ప్రభావం, నియంత్రణ చర్యలపై చర్చించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో కోవిడ్ వ్యాధి నియంత్రణకు, వైద్యానికి అవసరమైన అన్ని ఏర్పాట్లపై పర్యవేక్షించారు. అవి ఏ స్థాయిలో ఉన్నాయి, ఇంకెన్ని సమకూర్చాల్సి ఉందన్న విషయాన్ని చర్చించారు. కోవిడ్ పడకల సంఖ్య, ఆక్సిజన్ సరఫరా, కన్సంట్రేటర్ల లభ్యత, నిపుణుల నియామకాలు, ప్రత్యేక వార్డులపై డాక్టర్ లావణ్యకుమారి ఆరా తీశారు. సంబంధిత విభాగపు వైద్యాధికారులు వివరాలను సమర్పించారు. తాజా పరిస్థితులను అనుసరించి జేఎన్-1 వేరియంట్ ప్రమాదకారి కాకపోవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రతి సాధారణ రోగికి కొత్త వేరియంట్‌పై వైద్యం అందించే వైద్యులే పూర్తి స్థాయి అవగాహన కల్పించాలనీ, జాగ్రత్తలు సూచించాలని డాక్టర్ లావణ్యకుమారి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఐదుగురు సభ్యుల నోడల్ బృందాన్ని నియమించారు. డిప్యూటీ సూపరింటెండెంట్, మెడిసిన్, న్యూరాలజీ హెచ్‌వోడీ డాక్టర్ హరి విజయకుమార్ ఆధ్వర్యంలో ఈ బృందం పనిచేయనుంది. సమావేశంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విష్ణువర్ధన్ సహా సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పుష్కరరావు, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ అనిత, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో లక్ష్మీ సాయి అమృత ప్రతిభ



కాంస్య పతకం సాధించిన లక్ష్మీసాయి అమృత

రాజోలు: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో చింతలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని కోళ్ల లక్ష్మీ సాయి అమృత ప్రతిభ చూపి, కాంస్య పతకం సాధించింది. ఈ మేరకు పాఠశాల హెచ్ఎం దొంగ జానకిరామయ్య ఆధ్వర్యాన లక్ష్మీసాయి అమృతను ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో నంద్యాలలో జరిగిన అండర్-14 ఫెన్సింగ్ పోటీల్లో అమృత ప్రతిభ చూపిందన్నారు. ఆమెను సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, పీఎంసీ చైర్మన్ నల్లి నాగబాబు అభినందించారు.

90 రోజుల్లో ఇంటి స్థలం



ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేయాలని అనేక సార్లు తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లాను. రెండు రోజులు ఆగి రావమ్మా అని తిప్పి పంపేసేవారు. దరఖాస్తు తీసుకున్న నాథుడే లేకుండా పోయాడు. సచివాలయం వచ్చాక దరఖాస్తు పట్టుకుని వెళ్లాలనుకున్నాను. ఇంతలో వలంటీరు వచ్చి దరఖాస్తు తీసుకుని వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించింది. 90 రోజుల్లో నాకు ఇంటి స్థలం మంజూరై పట్టా చేతికొచ్చింది. పట్టాను హౌసింగ్ ఏఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంతో రూ.1.80 లక్షలు ఇంటికి రుణం కూడా మంజూరైంది.

– వల్లు నాగమణి, తాళ్లరేవు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి వచ్చా



మాది కాకినాడ జగన్నాథపురం. 2017లో బీటెక్ చదువుకున్నాను. చెన్నై టెక్‌మహేంద్రలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసి 2019లో వార్డు, గ్రామసచివాలయాల పోస్టు పరీక్ష రాశాను. డిజిటల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాను. కరప సచివాలయంలో పోస్టింగ్ వచ్చింది. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ మూడు షిఫ్టులలో పనిచేయాల్సి వచ్చే సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి రిజైన్ చేశాను. డిజిటల్ అసిస్టెంట్‌గా చేరాను. గతేడాది పర్మినెంట్ అయింది. సచివాలయాల ఏర్పాటు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న విప్లవాత్మకం నిర్ణయం.

– నూరాడ అబ్బాయి, డిజిటల్ అసిస్టెంట్, కరప

సామాన్యుల ముంగిట సేవాలయం

- 'తూర్పు' గడ్డపై సచివాలయానికి అంకురార్పణ
- నాడు కరపలో ప్రారంభించిన సీఎం జగన్
- సేవలతో ప్రజలకు చేరువైన ఘన వ్యవస్థ
- నేడు జగన్ జన్మదినాన సచివాలయ ఆవిర్భావ సంబరాలకు ఉద్యోగులు సన్నాహాలు

జిల్లాలో సచివాలయాలు	620
ఉద్యోగుల సంఖ్య	5513
అందుబాటులో సేవలు	547
ప్రతి రోజూ అందే సేవలు	120



కరపలో 2019 అక్టోబరు 2న గ్రామసచివాలయవ్యవస్థను లాంఛనంగా ప్రారంభించి, పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి జగన్(ఫైల్)

సాక్షిప్రతినిధి, కాకినాడ: అది 2019 అక్టోబరు 2.. నాలుగేళ్ల క్రితం గాంధీ జయంతి రోజున విప్లవాత్మక మార్పునకు 'తూర్పు' గడ్డ వేదికైంది. నాడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగా ఉన్న కాకినాడ సమీపాన కరపలో ఓ వినూత్న ఆవిష్కరణకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారు. అన్ని సేవలకూ కేరాఫ్‌గా నిలిచిన సచివాలయ వ్యవస్థను ప్రారంభించారు. నాడు విమర్శలు చేసిన విపక్షాల నోళ్లు మూత పడేలా నేడు పలు రాష్ట్రాలు ఈ వ్యవస్థను అమలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ముఖ్యమంత్రి తీసుకు వచ్చిన గ్రామ, వార్డు సచివాలయాలు ప్రజల అభిమానాన్ని చూరగొంటూ బలమైన ముద్ర వేసుకుంటున్నాయి.

పొలిమేర దాటక్కరలేదు

ప్రజల వద్దకు పాలనను అందిస్తామంటూ నాయకులు గతంలో చర్యలు తీసుకున్నా సచివాలయ వ్యవస్థ ముందు అవి దిగదుడుపే. సుపరిపాలనను..సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో ఈ వ్యవస్థ సఫలీకృతమై సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకుంది. గ్రామం లేదా, వార్డు పొలిమేర కూడా దాటకుండానే ఐదారు వందల సేవలు అందుబాటులోకి తేగలిగిన ఘనత సొంతం చేసుకుంది. ఈ వ్యవస్థను రూపకల్పన చేసిన జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోవాలనే సంకల్పంతో గురువారం ఆయన జన్మదినాన్ని సచివాలయ దినోత్సంగా జరుపుకోవాలని సచివాలయ ఉద్యోగులు నిర్ణయించారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు.

ఏది కావాలన్నా అందుబాటులో..

సచివాలయ వ్యవస్థ వచ్చాక ప్రజలకు దూరాభారం తప్పింది. మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పనిలేకుండా పోయింది. అవసరమైన అన్ని సేవలు సొంత ఊళ్లో సచివాలయంలో అందుబాటులోకి వచ్చాయి. జనన ధ్రువీకరణ పత్రమే కాదు మరేది కావాలన్నా గతంలో నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. వ్యయ ప్రయాసలు ఎదుర్కొనాల్సి వచ్చేది. ఇలాంటి ఇబ్బందులన్నింటికీ ఒకే ఒక పరిష్కార మార్గం సచివాలయంగా నిలిచింది. కొత్త రేషన్‌కార్డు కావాలన్నా, కార్డులో పేర్లు తొలగించాలన్నా, కొత్తగా పేర్లు కలపాలన్నా, అమ్మ ఒడికి దరఖాస్తు చేయాలన్నా, ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ మీటర్లకు రిజిస్ట్రేషన్, రైతు భరోసా కేంద్రాల్లో రైతుల రిజిస్ట్రేషన్ వంటి అనేక రకాల సేవలు అందుబాటులోకి తెచ్చింది. ప్రజల పని సులభతరం చేసే వేదికగా సచివాల వ్యవస్థ విప్లవాత్మకమైన మార్పునకు నాంది పలికింది.

ఎందరికో ఉద్యోగావకాశాలు

జిల్లాలో నిరుద్యోగ సమస్యకు ప్రభుత్వం సచివాలయాల ఏర్పాటుతో పరిష్కారం చూపింది. పెద్ద సంఖ్యలో ఉద్యోగాల కల్పనకు ఆస్కారం ఏర్పడింది. ఒకరు ఇద్దరు కాదు వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కూడా లభించాయి. చంద్రబాబు పాలనలో నిరుద్యోగమనేది లేకుండా చేస్తామని లేదా, నిరుద్యోగ భృతి ఇస్తామని మాట ఇచ్చి మోసం చేశారు. ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు.కానీ ముఖ్యమంత్రి జగన్ నాడు పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి సచివాలయ వ్యవస్థ ద్వారా ఒక్క మన జిల్లాలోనే 5513 మందికి శాశ్వత ఉద్యోగాలిచ్చారు.

ఆడుదాం ఆంధ్రకు ఏర్పాట్లు

కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశం



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఆడుదాం ఆంధ్ర నిర్వహణకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం ఆమె అధికారులతో సమావేశమయ్యారు. పురుషులు, మహిళల కోసం ఆడుదాం ఆంధ్ర పోటీలు ఐదు విభాగాల్లో వేర్వేరుగా గ్రామ సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో జరుగుతాయన్నారు. ఈనెల 26 నుంచి గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 15 రోజులు గ్రామ సచివాలయ స్థాయిలో నిర్వహిస్తామన్నారు. జనవరి 10 నుంచి ఫిబ్రవరి 5వతేదీ వరకు మండల స్థాయి, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో జరుగుతాయని తెలిపారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఈ పోటీలను విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు. వేదికల వద్ద టోర్నమెంట్లు నిర్వహించడానికి ఆర్గనైజింగ్, సాంకేతిక కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ, డీపీవో భారతి సౌజన్య, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జె నరసింహనాయక్, ఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు, జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ వైడీ రామారావు, క్రీడా శిక్షకులు రవిరాజు, పీఈటీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో మెరిట్ జాబితా

కాకినాడ క్రైం: నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో ఈ నెల 8వ తేదీన విడుదల చేసిన 76 పోస్టుల నోటిఫికేషన్‌కు సంబంధించిన మెరిట్ జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కాకినాడ.ఏపి.జీవోవీ.ఇన్, కోనసీమ.ఏపి.జీవోవి.ఇన్, ఈస్ట్‌గోదావరి.ఏపి.జీవోవి.ఇన్ వెబ్‌సైట్లను సందర్శించాలన్నారు. అభ్యంతరాలు ఉంటే గురువారం ఉదయం 10 గంటల నుంచి 23వతేదీ సాయంత్రం 5 గంటల లోపు కాకినాడలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు.

పేదల విదేశీ విద్యకు ప్రభుత్వ ప్రోత్సాహం

- జగనన్న విదేశీ విద్య కింద 13 మందికి రూ.1.33 కోట్లు పంపిణీ



విద్యార్థులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు

కాకినాడ సిటీ: పేద విద్యార్థులు విదేశాల్లోని టాప్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు, మరో వైపు సివిల్ సర్వీస్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలనే విద్యార్థుల కల సాకారం చేయడానికి ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తోందని కలెక్టర్ కృతికా శుక్లా చెప్పారు. జగనన్న విదేశీ విద్యాదీవెన, సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం పథకం కింద విద్యార్థులకు నిధులు పంపిణీ కార్యక్రమాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాడేపల్లిలోని కార్యాలయం నుంచి బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పెరికి కార్పొరేషన్ చైర్మన్ గంగాభవానిలతో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆమె లబ్ధిదారులనుద్దేశించి మాట్లాడారు. జిల్లాలో జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద ప్రభుత్వం 13 మందికి రూ.1,33,15,904 విడుదల చేసిందన్నారు. ఇందులో ఈబీసీ కేటగిరిలో ఐదుగురికి రూ. 37,85,423, ఐదుగురు కాపు విద్యార్థులకు రూ.61,76,845, ఇద్దరు బీసీ విద్యార్థులకు రూ.15,59,642, ఎస్సీ విద్యార్థికి రూ.17,93,994 ఖాతాల్లోకి ఆర్థిక సాయం జమచేసినట్లు పేర్కొన్నారు. జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద ఆరుగురికి రూ. 6.50 లక్షలు విడుదల చేసినట్లు వివరించారు. సంపన్నుల పిల్లలకే అందుబాటులో ఉన్న విదేశీ విద్యను పేదలు సైతం చదివేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటోందన్నారు. టాప్-50 ర్యాంకుల్లో ఉన్న కళాశాలల్లో ప్రవేశం పొందిన ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు రూ.1.25 కోట్ల వరకు, ఇతర విద్యార్థులకు ఒక కోటి రూపాయలు వరకు పూర్తి ఫీజు రీయంబర్స్‌మెంట్, విమాన ప్రయాణం, వీసా ఖర్చులతో సహా భరిస్తుందన్నారు. ప్రపంచంలోని టాప్-320 కాలేజీల్లో మన రాష్ట్ర విద్యార్థులు ఉచితంగా చదువుకునేందుకు వీలు కల్పిస్తోందన్నారు. సివిల్ సర్వీస్ పరీక్షలో ప్రిలిమినరీ పరీక్ష పాసైన విద్యార్థులకు రూ.లక్ష ప్రోత్సాహకం, మెయిన్స్ పరీక్షలో ఉత్తీర్ణులైతే అదనంగా మరో రూ. 50 వేలు , ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాల అభ్యర్థులకు అవసరమైన శిక్షణతో పాటు సొంతంగా ప్రిపేర్ అయ్యేందుకు ఆర్థికంగా తోడ్పాటునందిస్తుందన్నారు. ఎలాంటి పరిమితి లేకుండా ఈ ప్రోత్సాహకం అందిస్తుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సాంఘిక సంక్షేమ జాయింట్ డైరెక్టర్ డీవీ రమణమూర్తి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి నారాయణ, బీసీ సంక్షేమ అధికారి రాజేశ్వరి, లబ్ధిదారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈ ప్రోత్సాహం ఊహించలేదు



మా నాన్న విద్యాశాఖలో క్లర్క్‌గా పనిచేస్తున్నారు. 2021లో డిగ్రీ పూర్తి చేశాను. యూపీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకున్నాను. ప్రిలిమ్స్‌కి అర్హత సాధించడంతో పాటు మెయిన్ పరీక్షల్లో కూడా ఉత్తీర్ణత సాధించాను. రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సర్వీస్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం చాలా బాగుంది. ఇటువంటి సహాయాన్ని అసలు ఊహించలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

– ఎస్ సత్యసాయిరామ్, గైగోలుపాడు

పేద విద్యార్థులకు వరం



మాది చిన్న పల్లెటూరు. జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం నాలాంటి ఎందరో పేద విద్యార్థులకు వరం లాంటిది. పేద విద్యార్థులు ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి మంచి కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉంది. మాన నాన్న వ్యవసాయం చేస్తుంటారు. తల్లిదండ్రులు పెద్దగా చదువుకోకపోయినా నన్ను చిన్నప్పటి నుంచి చదువులో ప్రోత్సహించారు. సివిల్స్ ఆసక్తితో డిగ్రీతో పాటు యూపీఎస్సీ పరీక్షలకు శిక్షణ తీసుకున్నాను.

– ఎస్ సాయి కిరణ్, ఆనూరు, పెద్దాపురం మండలం

త్యాగం, దయ, శాంతి క్రీస్తు సందేశం

- కలెక్టర్ కృతికా శుక్లా
- జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్
- పాల్గొన్న ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కురసాల



హై-టీ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: త్యాగం, దయ, శాంతి వంటి గుణాలు ఇతరుల పట్ల కలిగి జీవించడమే నిజమైన క్రిస్మస్ అని, ఈ పండుగ జిల్లా ప్రజలందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆకాంక్షించారు. బుధవారం సాయంత్రం స్థానిక విక్టోరియా వాటర్ వర్క్స్ ప్రాంగణంలోని స్మార్ట్ సిటీ కార్యాలయ సమావేశ మందిరంలో క్రిస్మస్ ఈవ్ పురస్కరించుకుని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన హై-టీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. క్రిస్మస్ చాలా ప్రత్యేకమైందని, ఏ మతమైనా విశ్వశాంతినే బోధిస్తుందన్నారు. త్యాగం, దయ, శాంతి వంటి గుణాలు ఇతరుల పట్ల కలిగి జీవించడమే నిజమైన క్రిస్మస్ సందేశమని కలెక్టర్ అన్నారు. ప్రతి ఆదివారం అందరూ ఒక సమాజంగా కూడుకొని ప్రార్థనలు చేయడం క్రైస్తవులకు గొప్ప ప్రశాంతతను ఇస్తుందని, దేవుని పట్ల విశ్వాసం ఉంచడం చాలా అవసరమని ఇదే మనలను నిత్యం నడిపిస్తుందని కలెక్టర్ తెలిపారు. నేటి తరం బైబిల్ బోధించిన సందేశాలను, పది ఆజ్ఞలను తప్పనిసరిగా చదవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. బైబిల్ బోధించిన అంశాలు మానవులకు క్లిష్ట పరిస్థితుల్లో ఎంతగానో సహాయపడతాయన్నారు. క్రీస్తు ప్రవచించిన ప్రేమ, దయ, సేవ గుణాలతో సమాజం శాంతి సౌఖ్యాలతో వెల్లివిరియాలని కలెక్టర్ ఆకాంక్షించారు. క్రైస్తవుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు జిల్లాలో సక్రమంగా అమలవుతున్నాయన్నారు. అదే విధంగా జిల్లాలో 744 మంది పాస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల రూ.5 వేలు గౌరవ వేతనాన్ని అందిస్తోందన్నారు. ఏ మతం , కులం, చూడకుండా అర్హత ఉంటే చాలు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అన్నింటినీ డీబీటీ పద్ధతిలో అమలు చేస్తోందన్నారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో రూ.కోటి గ్రాంటుతో చర్చిల మరమ్మతులు, నూతన నిర్మాణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఇందుకు అవసరమైన రూ.5 కోట్లు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు జరిగిందన్నారు. కలెక్టర్ కృతికా శుక్లా ఈ సందర్భంగా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ క్రైస్తవులందరికీ శుభాలను అందించాలని, వారి ప్రార్థనలు, దీక్షలు సమాజంలో శాంతి సౌభాగ్యాలను నింపాలని కాంక్షించారు. నగరంలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు పూర్తి చేసుకున్నట్టు తెలిపారు. మరో అంతస్తు నిర్మాణానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మైనారిటీ వర్గాల పక్షపాతిగా వారి రక్షణ, భద్రతకు చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు. ప్రజల కష్టాలు, కన్నీళ్లను స్వయంగా చూసిన ఆయన ముఖ్యమంత్రిగా నిర్ణయాలు తీసుకోవడంలో కీలకపాత్ర పోషించినట్లు కన్నబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో క్రిస్మస్ హై-టీ సందర్భంగా బాప్టిస్ట్ థియోలాజికల్ సెమినార్ ప్రిన్సిపాల్ రంజిత్‌కుమార్, కాకినాడ జిల్లా పాస్టర్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ డీజీ శామ్యూల్‌సాగర్‌లు క్రిస్మస్ ప్రత్యేక సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు జోసఫ్ బెన్నీ, రిక్కీ గూటం తదితరులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని అతిథులు కొవ్వొత్తులు వెలిగించి, కేక్ కట్ చేశారు. వేడుకల్లో జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి బి.నారాయణ, కాకినాడ నగర పాస్టర్లు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కుడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధికార లాంఛనాలతో సీఆర్‌పీఎఫ్ జవాన్ అంత్యక్రియలు



కిరణ్‌కుమార్ అంతిమ సంస్కారాలు అధికార లాంఛనాలతో నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ జవాన్లు, అధికారులు

తుని రూరల్: జమ్మూలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) జవాను తంతటి కిరణ్‌కుమార్ అంత్యక్రియలు అధికార లాంఛనాలతో నిర్వహించారు. ఈ నెల 18న జమ్మూలో మృతి చెందిన ఆయన మృతదేహాన్ని తుని మండలంలోని స్వగ్రామం హంసవరానికి మంగళవారం రాత్రి తీసుకువచ్చారు. బంధువులు, గ్రామస్తుల సందర్శనార్థం బుధవారం ఉదయం 11 గంటల వరకూ గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి వద్ద ఉంచారు. సర్పంచ్ రాయి మేరీ అవినాష్, తహసీల్దార్ ఎల్.శివకుమార్, రూరల్ ఎస్సై విజయబాబు, జై భీమ్ మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు తంతటి కిరణ్‌కుమార్, సీఆర్‌పీఎఫ్ జవాన్లు కిరణ్‌కుమార్ పార్థివ దేహాన్ని సందర్శించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రార్థనల అనంతరం బంధువులు, సీఆర్‌పీఎఫ్ జవానులు, తుని రూరల్ పోలీసులు, పెద్ద సంఖ్యలో తరలివచ్చిన గ్రామస్తులతో కలసి కిరణ్‌కుమార్ అంతిమ యాత్ర నిర్వహించారు.

బయోమెట్రిక్ ఓటింగ్ యంత్రం



రంగంపేట జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న టి.ప్రసన్న, ఇ.భాను.. ఉపాధ్యాయిని రమ్యసుధ సహకారంతో బయోమెట్రిక్ ఓటింగ్ యంత్రానికి రూపకల్పన చేశారు. దీని ద్వారా ఓటరు వివరాలను బయోమెట్రిక్ విధానంలో అనుసంధానం చేయడం ద్వారా ఓటు హక్కు దుర్వినియోగం కాకుండా చూడటం సాధ్యమవుతుంది. దీనికోసం ఓటర్ల బయోమెట్రిక్ వివరాలను ఓటింగ్ యంత్రానికి అనుసంధానం చేయాల్సి ఉంటుంది. తద్వారా ఓటరు ఒక్కసారి మాత్రమే ఓటు వేసేందుకు అవకాశం ఉంటుంది. దీనివలన డూప్లికేట్ ఓటు వేసే అవకాశం ఉండదని ప్రసన్న, భాను వివరించారు.

సెన్సార్ ఆఫ్ డైలీ లైఫ్



కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి పి.చైతన్య.. ఉపాధ్యాయిని కె.గాయత్రి సహకారంతో ఈ ప్రాజెక్టును రూపొందించాడు. నిత్య జీవితంలో మన వాడే విద్యుత్ ఉపకరణాలు రిమోట్, స్విచ్‌ల పని లేకుండా.. కేవలం చప్పట్లు కొడితేనే పని చేసేలా ఈ సెన్సార్ ఉపయోగపడుతుందని చైతన్య చెప్పాడు.

ఎర్త్ రిజర్వాయర్



కొవ్వూరు మండలం మద్దూరు జెడ్పీ హైస్కూలు తొమ్మిదో తరగతి విద్యార్థినులు సీహెచ్ హవేలా, ఎం.లక్ష్మీదుర్గలు.. ఉపాధ్యాయుడు కేఎస్‌ఆర్ ఆంజనేయులు సహకారంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. వ్యవసాయానికి అవసరమైన నీటి సమస్యలను విద్యుత్ మోటార్లు లేకుండానే ఎర్త్ రిజర్వాయర్ పరిష్కరిస్తుంది. మొక్కకు అవసరమైనప్పుడు మాత్రమే ఎవరి సాయం అవసరం లేకుండా ఎర్త్ రిజర్వాయర్ నీటిని అందిస్తుందని హవేలా, లక్ష్మీదుర్గ వివరించారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- విద్యార్థులకు డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పిలుపు
- జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్: శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకుని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు పిలుపునిచ్చారు. పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యాన స్థానిక శ్రీ సత్యసాయి గురుకులంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను ఆయన సందర్శించి, అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలని, ఇష్టమైన రంగంలో రాణించాలని అన్నారు. ప్రదర్శనను ప్రారంభించిన జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎస్.అబ్రహం మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడతాయని అన్నారు. ఈ ప్రదర్శనలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన 57 ప్రాజెక్టులను రెండు రోజుల పాటు ప్రదర్శిస్తామని తెలిపారు. వీటిలో ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి, ఈ నెల 28న వైఎస్సార్ కడప జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి ఈవీబీఎన్ నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్‌కుమార్, రూరల్ ఎంఈఓ ఎ.దుర్గా తులసీదాస్, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ, గురుకులం కరస్పాండెంట్ శ్యామ్‌సుందర్, ప్రిన్సిపాల్ జి.గురవయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు వివిధ సామాజిక సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండి, సందర్శకులను ఆకట్టుకున్నాయి.



జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, చిత్రంలో డీఈఓ అబ్రహం తదితరులు

స్వచ్ఛాంధ్ర గ్రామ సచివాలయం ప్రాజెక్ట్



కడియం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు జి.విజయలక్ష్మి, ఎ.కీర్తి.. ఉపాధ్యాయుడు పి.తమ్మిరాజు సహకారంతో ఈ ప్రాజెక్టును రూపొందించారు. వివరాలివీ.. గ్రామ సచివాలయాల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్న డస్ట్ బిన్‌లకు సెన్సార్‌తో కూడిన ఎలక్ట్రానిక్ పరికరం ఏర్పాటు చేస్తారు. దీనిని సచివాలయంలోని ప్రధాన యూనిట్‌కు అనుసంధానం చేస్తారు. డస్ట్ బిన్ నిండిన వెంటనే సచివాలయానికి అనుసంధానం చేసిన యూనిట్ ద్వారా హెచ్చరిక వస్తుంది. దీంతో సంబంధిత సిబ్బంది చెత్త సేకరణకు వస్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యానికి ఈ ప్రాజెక్ట్ ఎంతో మేలు చేస్తుందని, తడి చెత్త నుంచి బయో కంపోస్ట్ ఎరువు తయారీకి అవసరమైన ముడి సరకు సేకరణను కూడా సులభతరం చేస్తుందని విద్యార్థినులు చెప్పారు.

మల్టీపర్పస్ అగ్రికల్చర్ ఈవీ



కోరుకొండ మండలం రాఘవపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పి.లహరి.. ఉపాధ్యాయిని ఎస్.నిర్మల సహకారంతో ఈ ప్రాజెక్టును రూపొందించింది. రైతు పంట పండించడానికి ముందు నేలను దున్ని, నీరు పెట్టి, విత్తనాలు చల్లి, ఎరువులు వేస్తాడు. పక్వానికి వచ్చాక పంట కోస్తాడు. అయితే ఈ పనులన్నింటికీ వేర్వేరు పరికరాలు ఉపయోగిస్తాడు. దీనివలన ధనం, సమయం వ్యయమవుతాయి. అయితే ఈ మల్టీపర్పస్ అగ్రికల్చర్ (బహుళార్థ సాధక వ్యవసాయ) పరికరం ద్వారా ఒక్క వ్యక్తే అన్ని పనులూ చేయవచ్చు. ఈ ఒక్క పరికరమే మొదట కలుపు తీసి, నేలను దున్నుతుంది. నీటిని పెడుతుంది. విత్తనాలు జల్లుతుంది. ఎరువులు వేస్తుంది. చదును చేసేస్తుంది. కోత కోస్తుంది. ఇలా ఈ పరికరం ద్వారా రైతు ఒక్కడే ఏడు పనులు చేసుకోగలుగుతాడు. ఈ పరికరం ఎలక్ట్రిక్ రీచార్జ్ వెహికల్ రూపంలో ఉంటుంది. దీనివలన ఇంధనం, ఖర్చు తగ్గుతాయి. వాతావరణ కాలుష్యాన్ని నిరోధించవచ్చు. దీనిని రీచార్జ్ చేయడానికి సోలార్ పద్ధతులను ఉపయోగించవచ్చు. ఇలా ఈ పరికరం రైతుకు ఎంతో లాభదాయకంగా వ్యవసాయ రంగానికి ప్రయోజనకరంగా ఉంటుంది.

రుడా చైర్మన్‌గా రౌతు సూర్యప్రకాశరావు



రుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న రౌతు

సాక్షి, రాజమహేంద్రవరం: నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రుడా చైర్‌పర్సన్‌గా ఉన్న మేడపాటి షర్మిలారెడ్డి పదవీ కాలం కొద్ది రోజుల కిందట ముగిసింది. ఆమె స్థానంలో నియమితులైన రౌతు రాజమండ్రి సిటీ ఎమ్మెల్యేగా ఆయన పదేళ్ల పాటు సేవలందించారు. సీఎం వైఎస్ జగన్ తనపై నమ్మకం ఉంచి, అప్పగించిన ఈ పదవిని బాధ్యతతో నిర్వర్తిస్తానని రౌతు చెప్పారు. రుడా కార్యాలయంలో చైర్మన్‌గా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

వాడపల్లి క్షేత్రంలో సిరుల వర్షం

- దండిగా హుండీల ఆదాయం
- వేంకటేశ్వరస్వామికి రూ.85.16 లక్షల రాబడి



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి క్షేత్రంలో సిరుల వాన కురిసింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మొత్తం 29 రోజులకు రూ.85,16,279 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ప్రధాన హుండీల నుంచి రూ.60,55,845, అన్న ప్రసాదం హుండీల ద్వారా రూ.24,60,434 మేర ఆదాయం వచ్చిందన్నారు. అలాగే, విదేశీ కరెన్సీ, 10 గ్రాముల బంగారం, 900 గ్రాముల వెండి కూడా లభించాయని తెలిపారు. ఆలయ క్షేత్ర పాలకుడు శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో కూడా హుండీల ద్వారా రూ.2,52,976 ఆదాయం సమకూరిందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ సత్యనారాయణరాజు ఆధ్వర్యాన జిల్లా దేవదాయ, ధర్మదాయ అధికారి కేఎన్‌వీడీవీ ప్రసాద్, పొడగట్లపల్లి ఉప్పలపాటి జానికీయమ్మ అన్నదాన సత్రం ఈఓ మీసాల రాధాకృష్ణ, వెల్ల గ్రూపు దేవాలయాల ఈఓ ఎస్‌వీవీ సత్యనారాయణ పర్యవేక్షణలో హుండీల ఆదాయాన్ని ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది లెక్కించారు. ఎస్సై బీవై కిరణ్‌కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

సాత్విక్‌కు ఖేల్‌రత్నపై హర్షం

- గతంలో అర్జున్ అవార్డు
- ఈ ఏడాది ఏడు బంగారు, ఒక రజత పతకం
- సహచరునికీ ఇదే అవార్డు

సాక్షి, అమలాపురం: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌కు దేశంలో క్రీడాకారులు ప్రతిష్టాత్మకంగా భావించే 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న' అవార్డు వరించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జాతీయ క్రీడా అవార్డులలో భాగంగా కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ బుధవారం ఈ అవార్డు ప్రకటించింది. అమలాపురానికి చెందిన సాత్విక్ అంతర్జాతీయ వేదికలపై షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో పలు విజయాలు సాధిస్తూ దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకువస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది అంతర్జాతీయంగా జరిగిన ఐదు టోర్నీల్లో బంగారు, ఒక టోర్నీలో రజత పతకం సాధించారు. ఇటీవల కామన్‌వెల్త్, ఆసియా గేమ్స్‌లో అరుదైన విజయాలు సాధించిన విషయం తెలిసిందే. ఈ విజయాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం అతడిని ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు ఎంపిక చేసింది. సాత్విక్‌తో పాటు అతడి డబుల్స్ సహచరుడు చిరాగ్ శెట్టి సైతం ఇదే అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ అవార్డును సాత్విక్ జనవరి 9న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులు మీదుగా రాష్ట్రపతి భవన్‌లో అందుకోనున్నారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో గత మూడు, నాలుగేళ్లుగా తిరుగులేని విజయాలు సొంతం చేసుకుంటున్న సాత్విక్ 2020లో ప్రతిష్టాత్మక అర్జున్ అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. ఆ సంవత్సరం కరోనా కారణంగా తొలుత వర్చువల్ విధానంలో అందుకున్న సాత్విక్ 2021లో న్యూఢిల్లీలో చేతుల మీదుగా అందుకున్నాడు. సాత్విక్‌కు అవార్డు రావడంపై ఆయన సొంత పట్టణం అమలాపురంలో క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు రంకిరెడ్డి కాశీ విశ్వనాథం, రమామణి బాణసంచా కాల్చి ఆనందాన్ని పంచుకున్నారు.



అమలాపురంలో సంతోషాన్ని పంచుకుంటున్న సాత్విక్ తల్లిదండ్రులు కాశీ విశ్వనాథం దంపతులు

చాలా సంతోషం

సాత్విక్‌కు ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. తల్లిదండ్రులుగా కన్నా సాత్విక్ ఆట నచ్చే అభిమానులుగానే ఎక్కువ ఆనందంగా ఉంది. సాత్విక్‌ను ప్రోత్సహిస్తున్న కోచ్‌లు, కోనసీమ అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు. – రంకిరెడ్డి కాశీ విశ్వనాథం, అమలాపురం



ఏషియన్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించిన సమయంలో ప్రధాన నరేంద్ర మోదీ నుంచి అభినందనలు అందుకుంటున్న సాత్విక్ (ఫైల్)

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా పద్మ



దూలం పద్మ

కపిలేశ్వరపురం (మండపేట): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన దూలం పద్మ నియామకాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తనకు ఉత్తర్వులందాయని పద్మ బుధవారం తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్‌గా ఆమె 2021 సెప్టెంబర్‌లో నియమితులయ్యారు. పదవీ కాలం ఇటీవల పూర్తి కాగా, ఆ పదవిలో కొనసాగించాలంటూ సంబంధిత అధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా పద్మ అన్నారు.

నేడు నన్నయలో మెగా జాబ్ మేళా

రాజానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు బుధవారం ఈ విషయం తెలిపారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యాన జరిగే ఈ మేళాలో విప్రో, టెక్ మహీంద్ర, ట్రెడ్ ఐటీ, ఎన్‌లైట్ టెక్నాలజీస్, అపోలో ఫార్మసీ, హెటిరో, కిమ్స్ ఆస్పత్రి, వరుణ్ మోటార్స్ తదితర 30 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని వివరించారు. సుమారు 3 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, ఫార్మసీ చదివిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఉదయం 9 గంటలకే వర్సిటీ ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. జాబ్ మేళా ఏర్పాట్లను వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ బుధవారం పరిశీలించారు.

నిధుల కేటాయింపుపై ఎంపీ గీత కృతజ్ఞతలు



పార్లమెంటులో మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత

కాకినాడ సిటీ: అమృత భారత్ పథకం కింద జిల్లాలోని కాకినాడ, సామర్లకోట, తుని రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రూ.45 కోట్లు మంజూరు చేసిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కాకినాడ ఎంపీ వంగా గీత కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్‌లో బుధవారం ఆమె మాట్లాడుతూ, కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని రైల్వే స్టేషన్లు, పిఠాపురం, గోర్స, మాధవపురం, తుని రైల్వే అండర్ బ్రిడ్జిలు (ఆర్‌యూబీ) మంజూరు చేసి, త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు అనుమతులు ఇవ్వాలని రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు. పిఠాపురంలో ఉప్పాడ గేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) మంజూరు చేశారని తెలిపారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌లో రెండో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, పిఠాపురంలో లిఫ్ట్ నిర్మించాలని, నియోజకవర్గ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో ప్రజలకు సరైన టాయిలెట్లు, మౌలిక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తన విజ్ఞప్తికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని, సంబంధిత అధికారులతో చర్చించి, తగిన ఆదేశాలు జారీ చేస్తామన్నారని ఎంపీ గీత తెలిపారు.

అశుతోష్ శ్రీవాత్సవ బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ: కొవ్వూరు సబ్ కలెక్టర్‌గా అశుతోష్ శ్రీవాత్సవ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలతను, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవాస్తవను కలెక్టర్ మాధవీలత అభినందించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సబ్ కలెక్టర్‌గా కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని అన్నారు. జేసీ తేజ్‌భరత్ కూడా శ్రీవాత్సవకు అభినందనలు తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌కి చెందిన శ్రీవాత్సవ 2021 ఐఏఎస్ బ్యాచ్ అధికారి. గ్వాలియర్‌లో బీఈ (ఎలక్ట్రానిక్స్) చదివి, 2021 సివిల్స్‌లో 223 ర్యాంక్ సాధించిన ఆయనను ఆంధ్రా కేడర్‌కు కేటాయించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో అసిస్టెంట్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ పొందారు. అక్కడి నుంచి సబ్ కలెక్టర్‌గా బదిలీపై కొవ్వూరు వచ్చారు.



కలెక్టర్ మాధవీలతను కలిసిన కొవ్వూరు నూతన సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

27న ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు



ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌లలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ప్రవేశాలకు ఈ నెల 27న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఏపీ ఐసెట్-2023లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు కోరారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎంబీఏ 11, ఎంబీఏ టూరిజం అండ్ హాస్పిటాలిటీ 18, ఎంసీఏ 8 చొప్పున సీట్లు ఉన్నాయన్నారు. తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో ఎంబీఏ 21, కాకినాడ క్యాంపస్‌లో ఎంబీఏ 24, ఎంసీఏలో 17 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావాలని, అడ్మిషన్ నిర్ధారణ అయితే వెంటనే ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు.

ఎన్నికల్లో శాంతిభద్రతలను పరిరక్షించాలి

కాకినాడ క్రైం: వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఏలూరు రేంజి డీఐజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. జిల్లా పోలీసు శాఖ పరిధిలో రెండు రోజుల పాటు ఆయన చేసిన తనఖీలు బుధవారం పూర్తయ్యాయి. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలీసు బలగాలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో భద్రతే ప్రధానాంశంగా తగిన ప్రణాళికలు సిద్ధం చేసి, అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సిబ్బందికి తగిన సదుపాయాలు కల్పించడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని పరిపాలనాధికారికి సూచించారు. తొలి రోజు కార్యాలయ పరిపాలనా విభాగాల్లో తనిఖీలు చేశారు. వార్షిక ప్రగతి నివేదికలు పరిశీలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూము నిర్వహణను డీఎస్పీ రామకోటేశ్వరరావు వివరించారు. వ్యాయామ శాలను పరిశీలించిన డీఐజీ నిర్వహణ బాగుందని కితాబిచ్చారు. బుధవారం ఆర్మ్‌డ్ రిజర్వు విభాగం నిర్వహించిన ప్రత్యేక పరేడ్‌కు హాజరై గౌరవ వందనం స్వీకరించి, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ఆయుధాగారం, పోలీసు జాగిలాలు, బాంబ్ డిస్పోజబుల్ స్క్వాడ్‌లను డీఐజీ స్వయంగా పరిశీలించారు. డీఐజీ వెంట ఎస్పీలు సతీష్‌కుమార్, శ్రీనివాస్, అదనపు ఎస్పీ సత్యనారాయణ, ఏఓ శివరామరాజు, డీఎస్పీలు వెంకట అప్పారావు, రామకోటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు ఈశ్వరుడు, శ్రీనివాస్, శ్రీహరిరావు తదితరులు ఉన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్